సాక్షి నాగర్‌కర్నూల్

గురువారం । 23 । జనవరి । 2025



ముగిసిన బ్రహ్మోత్సవాలు

నల్లమలలో ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాలు వైభవంగా ముగిశాయి.

వివరాలు 8లో ▸



పెరిగిన ఉల్లి ధర

దేవరకద్ర మార్కెట్‌లో ఉల్లి క్వింటా గరిష్టంగా రూ. 4,020 ధర పలికింది.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 36.2 /11.4

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతం అవుతుంది. ఉదయం, రాత్రివేళ చలి తీవ్రత ఉంటుంది. మంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

దివ్యాంగులకు రాయితీ రుణాలు

నాగర్‌కర్నూల్: ఆర్థిక పునరావాస పథకం కింద 2024–25 సంవత్సరానికి గాను దివ్యాంగులకు రాయితీపై రుణాలు అందిస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వయం ఉపాధి, పునరావాసం, చేతివృత్తులు, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసుకునే దివ్యాంగులకు నాన్ బ్యాంక్ లింకేజీ యూనిట్లు మంజూరు చేయనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన వారు ఫిబ్రవరి 2వ తేదీలోగా https:tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

నాగర్‌కర్నూల్/బల్మూర్: విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బల్మూరు మండలం చెన్నారం గ్రామపంచాయతీ కార్యదర్శి వేణుగోపాల్‌ను సస్పెన్షన్ చేస్తూ బుధవారం కలెక్టర్ బదావత్ సంతోష్ ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ కార్యదర్శి తన విధులను సక్రమంగా నిర్వర్తించకపోవడం.. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేయనున్న నాలుగు పథకాలకు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కోసం గ్రామంలో చేపట్టిన సభకు గైర్హాజరు కావడం.. ఇతర అంశాల్లోనూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే కారణంతో సస్పెన్షన్ చేసినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రూ.2కోట్లతో అభివృద్ధి



అచ్చంపేట: అచ్చంపేట మున్సిపాలిటీ అభివృద్ధికి రూ. 2కోట్లు కేటాయించినట్లు ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. బుధవారం జరిగిన మున్సిపల్ కార్యాలయంలో జరిగిన కౌన్సిల్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దడానికి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తామని చెప్పారు. ఇప్పటికే పట్టణంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో సీసీరోడ్లు, మురుగు కాల్వలు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఆర్టీసీ బస్టాండ్ వద్ద రూ. 40లక్షలతో డ్రెయినేజీ, రోడ్డు నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మున్సిపల్ కార్యాలయ నూతన భవనం ప్రారంభిస్తామన్నారు. సమస్యల పరిష్కారం కోసం అధికారులు, కౌన్సిలర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, వైస్ చైర్‌పర్సన్ పోరెడ్డి శైలజ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, కౌన్సిలర్లు గౌరీశంకర్,మన్నుప్రసాద్, రమేష్‌రావు, అంతటి శివ, తగురం శ్రీనివాసులు, సోమ్లానాయక్ ఉన్నారు.

పీహెచ్‌సీలో కేంద్ర బృందం తనిఖీ



మన్ననూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం జాతీయ జనాభా పరిశోధన కేంద్ర బృందం ఆకస్మిక తనిఖీలు చేపట్టింది. పీహెచ్‌సీ పరిసరాలతో పాటు రోగులకు అందిస్తున్న సేవలు, వైద్య పరికరాలను కేంద్ర బృందం డా.కవిత, డా.మాలవిక పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులు, సిబ్బందితో సమావేశమయ్యారు. నల్లమలలో పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అవసరమైన పరికరాలు, పరిస్థితులను తెలుసుకున్నారు. ఆస్పత్రి సేవల్లో భాగంగా మందులు, ఇంజక్షన్లు, తదితరాలతో పాటు ఇంటర్నెట్ సౌకర్యాలపై ఆరా తీశారు. డయాగ్నొస్టిక్, పల్లె దవాఖాన, ఆయుష్ సేవలపై చర్చించారు. పీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులతో పాటు ఏజెన్సీ ప్రాంత ఆస్పత్రులకు కేంద్ర ప్రభుత్వ నిధులు అందించేందుకు తమవంతు కృషి చేస్తామని తెలిపారు. అనంతరం కేంద్ర బృందాన్ని పీహెచ్‌సీ సిబ్బంది శాలువాలతో ఘనంగా సన్మానించారు. డా.సుధాకర్, డా.గౌతమ్, హెల్త్ సూపర్‌వైజర్ రాజేశ్వరి, హెచ్‌సీ హరినాయక్, శ్రీకాంత్, లక్ష్మణ్, కవిత, లక్ష్మి పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటాల్ రూ. 6,900

కల్వకుర్తి రూరల్: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డుకు బుధవారం 2,155 క్వింటాళ్ల వేరుశనగ అమ్మకానికి వచ్చింది. క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 6,900, కనిష్టంగా రూ. 4,500 ధర పలికింది. అదే విధంగా కందులకు గరిష్టంగా రూ. 6,769, కనిష్టంగా రూ. 6,739 ధరలు వచ్చాయి. మార్కెట్‌కు వ్యవసాయ ఉత్పత్తులను తీసుకువచ్చిన 186 మంది రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టినట్లు మార్కెట్ కార్యదర్శి భగవంతు తెలిపారు.

స్పష్టత కరువు..!

లబ్ధిదారుల జాబితాపై గందరగోళం



కుడికిళ్ల గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

- జిల్లాలో 137 గ్రామ, 28 వార్డు సభల నిర్వహణ
- పలు చోట్ల నామమాత్రంగా సభలు
- అర్హుల జాబితా సైతం వెల్లడించని అధికారులు
- రెండోరోజు 9,918 దరఖాస్తులు

సాక్షి, నాగర్‌కర్నూల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాలకు అధికారులు ప్రకటించిన లబ్ధిదారుల జాబితాలపై గందరగోళం నెలకొంది. జాబితాలో తమ పేర్లు లేవని దరఖాస్తుదారులు ఆందోళన చెందుతున్నారు. కొంతమంది అనర్హులకు జాబితాలో చోటు కల్పించి.. తమను నిర్లక్ష్యం చేశారని అధికారులను ప్రశ్నిస్తున్నారు. అయితే మళ్లీ దరఖాస్తులు ఇస్తే స్వీకరిస్తామని.. అర్హులైన వారందరికీ ప్రభుత్వ పథకాలను వర్తింపజేస్తామని అధికారులు చెబుతున్నారు. బుధవారం జిల్లావ్యాప్తంగా 137 గ్రామాలు, మున్సిపాలిటీల్లోని 28 వార్డుల్లో సభలను నిర్వహించారు. రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తుదారులు పోటెత్తారు. మొత్తం 9,918 అర్జీలను అధికారులకు సమర్పించారు. ఈ నెల 24 వరకు గ్రామసభల ద్వారా దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగనుంది.

రెండో రోజు వచ్చిన దరఖాస్తులు..		
రేషన్ కార్డులు 6,489	ఇందిరమ్మ ఇళ్లు 2,487	ఆత్మీయ భరోసా 883
రైతుభరోసా 59	మొత్తం 9,918	

జాబితాలో పేర్లు లేక..

కొత్త రేషన్‌కార్డుల మంజూరుతో పాటు రైతుభరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇళ్ల పథకాలకు గతంలోనే ప్రజాపాలనలో దరఖాస్తులను స్వీకరించింది. ప్రభుత్వానికి అందిన దరఖాస్తుల ఆధారంగా క్షేత్రస్థాయిలో సర్వే చేపట్టింది. ఈ నెల 26 నుంచి లబ్ధిదారులకు ప్రభుత్వ సాయాన్ని అందించాలని నిర్ణయించగా.. లబ్ధిదారుల జాబితాను గ్రామసభల్లో ప్రకటిస్తున్నారు. అయితే కొన్ని గ్రామాల్లో ఆయా పథకాలకు సంబంధించిన జాబితాల్లో దరఖాస్తుదారుల పేర్లు లేకపోవడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరికొన్ని గ్రామాల్లో అసలు జాబితాలో పేర్లు చదవకుండానే నామమాత్రంగా గ్రామసభలను ముగిస్తున్నారు. లింగాల మండలంలోని పలు గ్రామాల్లో జాబితాలోని పేర్లు వెల్లడించలేదు. తర్వాత గ్రామపంచాయతీ భవనంలో అందుబాటులో ఉంచుతామని అధికారులు చెప్పడంతో గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తంచేశారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా పథకాలకు అధికారులు సిద్ధం చేసిన జాబితాలో తమ పేర్లు ఉన్నాయా లేదా అని ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రజల నుంచి మళ్లీ దరఖాస్తులను స్వీకరిస్తామని అధికారులు చెబుతున్నా.. ఇప్పటికే ఇచ్చిన దరఖాస్తులకే మోక్షం లేదని, మళ్లీ వచ్చేది ఎప్పుడని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై కొల్లాపూర్ మండలం కుడికిళ్లలో జరిగిన గ్రామసభ రసాభాసగా మారింది. నాగర్‌కర్నూల్ మండలం గుడిపల్లిలో నిర్వహించిన గ్రామసభకు కలెక్టర్ బదావత్ సంతోష్ హాజరుకాగా.. గ్రామస్తులు చాలా మంది తమ పేర్లు జాబితాలో లేవని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని.. అర్హులైన వారికి తప్పకుండా అవకాశం కల్పిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. తిమ్మాజీపేట మండలం నేరళ్లపల్లిలో గ్రామసభలో రుణమాఫీ పథకాన్ని తమకు వర్తింపజేయలేదని ఆర్డీఓ సురేశ్‌ను రైతులు ప్రశ్నించారు.

దరఖాస్తు చేసుకున్నా పేరు రాలేదు..



నాకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరు పిల్లలు ఉన్నారు. గతంలో ప్రజాపాలన కార్యక్రమంలో కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. ఈసారి లిస్టులో నా పేరు రాలేదు. మళ్లీ దరఖాస్తు చేయాలని అధికారులు చెబుతున్నారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకున్నా ఫలితం లేకుండా పోయింది. ఈసారైనా ప్రభుత్వం స్పందించి అర్హులైన వారికి రేషన్‌కార్డులు ఇవ్వాలి.

– నారోజు కిరణ్‌చారి, గోకారం, చారకొండ మండలం

'ఆత్మీయ భరోసా'పై అభ్యంతరాలు..

గ్రామసభల్లో ప్రధానంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసాపై ప్రజల నుంచి అభ్యంతరాలు వెల్లువెత్తుతున్నాయి. ఈ పథకం కింద భూమి లేని రైతు కూలీలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున ఆర్థిక సాయం ఇవ్వాల్సి ఉండగా.. అధికారులు జాబితాను సిద్ధం చేశారు. భూమి లేని పేదలు కనీసం 20 రోజులపాటు ఉపాధి హామీ పథకంలో పనిచేయాలన్న నిబంధనను సైతం చాలా చోట్ల పాటించకుండానే అనర్హులను ఎంపిక చేశారంటూ అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా వ్యవసాయ పనులకు ఎక్కువ కూలీ ఉండటంతో ఆ పనులకే వెళ్లామని.. ఉపాధి పనులకు వెళ్లని కారణంగా అనర్హులంటూ ఎలా పేర్కొంటారని రైతు కూలీలు ప్రశ్నిస్తున్నారు. ఉపాధి హామీ పనులతో సంబంధం లేకుండా భూమి లేని నిరుపేదలకు పథకాన్ని వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డు భద్రత అందరి బాధ్యత



బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లకు హెల్మెట్లు పంపిణీ చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్

- వాహనదారులు విధిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలి
- కలెక్టర్ బదావత్ సంతోష్

నాగర్‌కర్నూల్ క్రైం: రోడ్డు ప్రమాదాలను నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా బుధవారం జిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి అంబేడ్కర్ చౌక్ వరకు చేపట్టిన ర్యాలీని ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్‌తో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోడ్డు భద్రత అనేది సమష్టి బాధ్యత అని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ రూల్స్ పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనంపై ప్రయాణించే వారు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం తాగి వాహనం నడపరాదన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, అతివేగం, అజాగ్రత్తతో ఓవర్‌టేక్‌లు చేయడంలాంటి వాటితో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉంటుందన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చన్నారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. జిల్లాలో రోడ్డు ప్రమాదాలను తగ్గించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం రహదారి భద్రతకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. బ్లూకోల్ట్ కానిస్టేబుళ్లకు హెల్మెట్లు పంపిణీ చేశారు. ఏఎస్పీ రామేశ్వర్, డీటీఓ చిన్నబాలు, డీఎస్పీ శ్రీనివాస్, ఆర్టీసీ డీఎం యాదయ్య పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి

నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భజనం నాణ్యతగా ఉండాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. నాగర్‌కర్నూల్ మండలంలోని గుడిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలు, వంట గదుల్లో శుభ్రత, ఆహార పదార్థాలు, కూరగాయల నాణ్యతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలను మరింత మెరుగుపర్చాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రతి తరగతి గది శుభ్రంగా ఉండాలని స్పష్టం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన, పోషకాలతో కూడిన ఆహారం అందించడం అత్యంత ప్రధానమని అన్నారు. మధ్యాహ్న భోజనానికి ఉపయోగించే కూరగాయలు, బియ్యం, ఇతర పదార్థాల నాణ్యతను కచ్చితంగా పరిశీలించాలని.. వాటిని సరైన రీతిలో అందుబాటులో ఉంచాలని సూచించారు. రోజువారీ మెనూ పకడ్బందీగా అమలుచేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం పదో తరగతి సిలబస్ పూర్తిపై విద్యార్థులతో ఆరా తీశారు. వార్షిక పరీక్షల్లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు.

నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు

తాడూర్: నిరంతర సాధనతోనే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని.. పదో తరగతి విద్యార్థులు పట్టుదలతో వార్షిక పరీక్షలకు సన్నద్ధం కావాలని డీఈఓ రమేష్ కుమార్ సూచించారు. బుధవారం తాడూర్ మండలంలోని పాపగల్, శిర్సవాడ, ఇంద్రకల్ పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పలు రికార్డులతో పాటు విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. పదో తరగతి వార్షిక పరీక్షలకు మరో 55 రోజులు మాత్రమే ఉన్నాయని.. ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ప్రణాళికా బద్ధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. విద్యార్థుల్లో ఆలోచనా శక్తిని పెంపొందించి, వారి ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలని విద్యార్థులకు సూచించారు. డీఈఓ వెంట ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో జనాన్ని పీడిస్తే సహించం

- వైద్యరంగంలో వినూత్న పథకాలు
- ప్రతి 30 కిలోమీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్ ఏర్పాటు
- రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ



దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

దేవరకద్ర/భూత్పూర్: ప్రజల అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని దోపిడీకి పాల్పడే ప్రైవేటు ఆస్పత్రులపై కఠినచర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ హెచ్చరించారు. దేవరకద్రలో రూ.35 కోట్లతో నిర్మించే వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడారు. నిబంధనలను ఉల్లంఘించి, ప్రజలను దోపిడీ చేసే ప్రైవేటు ఆస్పత్రుల యాజమాన్యాలపై చర్యలకు ఉపేక్షించేది లేదన్నారు. చట్ట వ్యతిరేకంగా ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంటేషన్ చేసిన ఆస్పత్రుల యాజమాన్యంపై కఠిన చర్యలకు ఆదేశించడం జరిగిందన్నారు. వైద్యరంగంలో వినూత్న పథకాలను అమలు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. జాతీయ రహదారులు, ప్రధాన రోడ్లపై చోటుచేసుకునే ప్రమాదాల్లో గాయపడ్డ వారికి తక్షణం వైద్యసేవలు అందించేందుకు ప్రతి 30 కిలో మీటర్లకు ఒక ట్రామా కేర్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఒక్కో సెంటర్ ఏర్పాటుకు రూ.5 కోట్ల వరకు వెచ్చించనున్నట్లు చెప్పారు. దేవరకద్ర, మక్తల్‌లో ట్రామా కేర్, డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేస్తామన్నారు. అదేవిధంగా కిడ్నీ రోగులకు అందుబాటులో ఉండేలా ప్రతి 30 కిలోమీటర్లకు ఒక డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. చిన్నచింతకుంటలోనూ డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దేవరకద్రలో వంద పడకల ఆస్పత్రి భవనాన్ని ఏడాదిలోగా పూర్తిచేసి అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. పేదలకు విద్య, వైద్యం, సామాజిక భద్రతను అందించే బాధ్యత ప్రభుత్వానిదని అన్నారు. వైద్యసేవల కోసం 8 వేల మంది డాక్టర్లు, నర్సులను నియమించినట్లు మంత్రి చెప్పారు.

అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు

అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. భూత్పూర్ మండలం కప్పెటలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడుతూ.. ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. పార్టీలు, వర్గాలకు అతీతంగా ఆరు గ్యారంటీలు అందిస్తామన్నారు. గత ప్రభుత్వం 10 ఏళ్ల నుంచి ఇళ్లు, నాలుగేళ్ల నుంచి పింఛన్లు ఇవ్వలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ఉద్దేశమన్నారు. భూమిలేని నిరుపేదలకు ఏడాదికి రూ.12వేల చొప్పున అందించేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. కార్యక్రమంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, టీవీవీపీ కమిషనర్ డా.అజయ్‌కుమార్‌తో పాటు వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ భృతి'పై నిర్లక్ష్యం తగదు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతిని అమలుపర్చకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని డీవైఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి నాగపూర్ మధు అన్నారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ బుధవారం డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26 నుంచి అమలు చేయనున్న కొత్త పథకాలతో పాటు నిరుద్యోగ భృతిని అమలుపర్చాలని డిమాండ్ చేశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీ మేరకు ఏటా 2 లక్షల ఉద్యోగాలను భర్తీ చేయాలన్నారు. నాగరాజు, మల్లిఖార్జున్, జీవన్, శివ, భరత్ పాల్గొన్నారు.



గ్రేడింగ్ మెరుగుపడేనా?

నేటినుంచి పీయూలో న్యాక్ బృందం తనిఖీలు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: పాలమూరు యూనివర్సిటీని గురువారం న్యాక్ (నేషనల్ అసెస్‌మెంట్ అండ్ అక్రిడిటేషన్ కౌన్సిల్) బృందం సందర్శించి మూడు రోజుల పాటు విస్తృత తనిఖీలు చేపట్టనుంది. ఇప్పటికే పీయూలో విద్యార్థులకు అందిస్తున్న కోర్సులు, రీసెర్చ్ అంశాలు, పీహెచ్‌డీ, పీజీ, యూజీ కోర్సులతో పాటు హాస్టల్ వసతులు, స్కిల్స్, ప్లేస్‌మెంట్, స్పోర్ట్స్, లైబ్రరీలు, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్‌లు, కరిక్యులర్ యాక్టివిటీస్ వంటి అంశాలపై అధికారులు పూర్తి సమాచారాన్ని ఆన్‌లైన్ ద్వారా న్యాక్ అధికారులకు సమర్పించారు. అయితే ఆరుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం పీయూను పరిశీలించి.. ఇక్కడి అధికారులు ఇచ్చిన సమాచారంలోని అంశాలు, వసతులపై తనిఖీలు నిర్వహించనున్నారు. న్యాక్ బృందం బుధవారం హైదరాబాద్‌కు చేరుకుంది. అక్కడి నుంచి గురువారం పీయూకు రానున్నారు. వారికి ఘనంగా స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేశారు. మూడు రోజులపాటు వారికి జిల్లా కేంద్రంలోనే వసతి కల్పించనున్నట్లు పీయూ అధికారులు వెల్లడించారు.

పూర్తిస్థాయిలో ఏర్పాట్లు..

న్యాక్ బృందం సందర్శన నేపథ్యంలో పీయూ పరిధిలోని కళాశాలలతో పాటు గద్వాల, కొల్లాపూర్, వనపర్తి పీజీ సెంటర్లను పూర్తిస్థాయిలో తీర్చిదిద్దారు. అన్ని కళాశాలలు, హాస్టల్ భవనాలకు పెయింటింగ్ వేయించడంతో పాటు కొత్త వాటర్ ఫిల్టర్లు, సీసీ కెమెరాలు, ఫర్నీచర్ ఏర్పాటు చేశారు. సోలార్ విద్యుత్ వినియోగం కోసం పీయూ అడ్మినిస్ట్రేషన్ భవనంపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటు చేశారు. ఇటీవల నిర్మించిన పలు కొత్త భవనాలను సైతం అందుబాటులోకి తీసుకువచ్చారు. పీజీ సెంటర్లలో సైతం అకాడమిక్, అడ్మినిస్ట్రేషన్ భవనాలు, హాస్టల్ భవనాలను నిర్మించారు. సింథటిక్ ట్రాక్, బాస్కెట్ బాల్ కోర్టులను సైతం నిర్మించారు. తద్వారా న్యాక్ తనిఖీల్లో పీయూ ఏ గ్రేడ్ సాధించేందుకు అవకాశాలు మెరుగ్గా ఉన్నట్లు తెలుస్తోంది.

- విద్యార్థులకు కల్పిస్తున్న వసతులు, కోర్సులు తదితర అంశాలపై సమగ్ర వివరాలు సేకరణ
- మూడు రోజులపాటు కొనసాగనున్న పరిశీలన
- అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన పీయూ అధికారులు



పీయూ పరిధిలో 154 కళాశాలలు..


పీయూ పరిధిలో మొత్తం 154 కళాశాలలు ఉన్నాయి. ఇందులో యూజీ 90 ఉండగా.. 15,263 మంది విద్యనభ్యసిస్తున్నారు. పీజీ కళాశాలలు 18 ఉండగా.. 1,360 మంది చదువుతున్నారు. బీఎడ్ 29, ఇంటిగ్రేటెడ్ బీఈడీ 3 కళాశాలల్లో 2,405 మంది, ఎంఈడీ కళాశాలలు 3 ఉండగా.. 86 మంది, బీపెడ్ కళాశాలలు 3 ఉండగా.. 103 మంది, ఎంబీఏ 6, ఎంసీఏ ఒక కళాశాల ఉండగా.. 281 మంది, ఫార్మసీ కళాశాలలు 3 ఉండగా.. 256 మంది, ఒక లా కళాశాలలో 40 మంది చదువుతున్నారు. వీరికి పరీక్షల నిర్వహణ, జవాబు పత్రాల వ్యాల్యువేషన్, పాస్ పర్సంటేజీ వంటి వాటిని పరిశీలించనున్నారు.

ఏ గ్రేడ్ సాధిస్తే ప్రయోజనం..



యూనివర్సిటీకి ప్రస్తుతం బీ గ్రేడ్ ఉంది. దీన్ని అధిగమించి ఏ గ్రేడ్ సాధించేందుకు కృషి చేస్తున్నాం. మూడు రోజుల పాటు న్యాక్ బృందం పీయూను సందర్శించనున్న నేపథ్యంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. గ్రేడ్ పెరిగితే మరిన్ని నిధులు రావడంతో పాటు యూనివర్సిటీ పరిధిలోని విద్యార్థులకు ప్రయోజనం చేకూరుతుంది. వారి సర్టిఫికెట్‌పై గ్రేడ్ ముద్రిస్తాం. మంచి గ్రేడ్ ఉంటే విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. – జీఎన్ శ్రీనివాస్, వైస్ చాన్స్‌లర్, పీయూ

సమష్టిగా ముందుకు..



ఆరుగురు సభ్యులతో కూడిన న్యాక్ బృందం పీయూను సందర్శించనుంది. వారు అకాడమిక్ యాక్టివిటీస్, రీసెర్చ్, స్పోర్ట్స్, క్యాంపస్ రిక్రూట్‌మెంట్ మొదలుకొని చెక్‌బుక్కులు, రికార్డులు, అటెండెన్స్ వంటి వాటన్నింటినీ పరిశీలిస్తారు. గతం కంటే వసతులు పెరిగిన నేపథ్యంలో ఏ గ్రేడ్ వస్తుందని భావిస్తున్నాం. టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది సమష్టి కృషితో అన్ని పనులు పూర్తిచేశాం. – చెన్నప్ప, రిజిస్ట్రార్, పీయూ

పూర్తి వివరాలు సమర్పిస్తాం..



గతంలోనే న్యాక్‌కు ఆన్‌లైన్‌లో పూర్తి వివరాలు అందించాం. ఇందుకు సంబంధించి విచారణకు వచ్చే కమిటీ సభ్యులకు అన్ని వివరాలు సమర్పిస్తాం. మూడు రోజులపాటు పీయూ కళాశాలలు, పీజీ సెంటర్లను తనిఖీలు చేయనున్న నేపథ్యంలో అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉన్నారు. మంచి గ్రేడింగ్ సాధించి పీయూ విద్యార్థులకు మెరుగైన విద్య అందించేందుకు కృషిచేస్తాం. – మధుసూదన్‌రెడ్డి, ఐక్యూఏసీ డైరెక్టర్, పీయూ

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


రాకేష్(ఫైల్)

నారాయణ పేట టౌన్: దామరగిద్ద రోడ్డులో గల ఇటుకబట్టీల సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందినట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. వివరాలు.. పట్టణంలోని సుభాష్‌రోడ్డుకు చెందిన గజ్జలి రాకేష్(29) తన బైక్‌పై మద్దూర్ వైపు నుంచి నారాయణపేటకు వస్తున్నాడు. పట్టణ శివారులోని ఇటుక బట్టీల వద్దకు రాగానే నారాయణపేట నుంచి ఎదురుగా వస్తున్న మినీ డీసీఎం వ్యాన్ రాకేష్‌ను ఢీకొట్టింది. అతడు కిందపడిపోగా తలకు బలమైన గాయమై రక్తస్రావం జరిగి అక్కడికక్కడే మరణించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

లారీ ఢీకొని వ్యక్తి దుర్మరణం

మక్తల్: లారీ బైక్‌ను ఢీకొని ఓ వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన పట్టణంలో నల్లజానమ్మ దేవాలయం బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మక్తల్ మండలం పంచదేవ్‌పాడు గ్రామానికి చెందిన తాయప్ప(50) అనే వ్యక్తి తమ బంధువుల ఇంటి దగ్గర నుంచి బైక్ తీసుకొని చెరువుకట్ట దగ్గర ఉన్న పెట్రోల్ బంకులో పెట్రోల్ పోయించుకున్నాడు. ఇంటికి తిరిగి వస్తున్న సమయంలో నల్లజానమ్మ దేవాలయం ముందు రాయిచూర్ నుంచి వస్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. అతడి తలకు బలమైన గాయాలు కావడంతో 108 వాహనంలో మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ తాయప్ప మృతిచెందాడు. మృతుడికి భార్య మహాదేవమ్మ, ఐదు మంది కూతుళ్లు ఉన్నారు.

ఉరేసుకొని యువకుడు బలవన్మరణం


శివ (ఫైల్)

మరికల్: మండలానికి చెందిన ఓ యువకుడు ఫ్యాన్‌కు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని చిత్తనూర్‌కు చెందిన శివ(21) కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్‌లోని చింతల్‌లో ఉంటూ ఆటో నడుపుతున్నాడు. వారం రోజుల క్రితం శివ వాళ్ల అన్న శివ మాలధారణ వేసుకోవడానికి తల్లితో కలిసి చిత్తనూర్‌కు వచ్చారు. కాగా హైదరాబాద్‌లోనే ఉన్న శివ ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు అతడి స్నేహితులు కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. వారు హైదరాబాద్‌కు చేరుకొని అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు. శివ మృతితో ఆకుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కుటుంబ కలహాలతో మహిళ..

కోస్గి రూరల్: కుటుంబ కలహాలతో ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని ముశ్రీఫా గ్రామంలో చోటుచేసుకుంది. స్థానికులు వివరాలు.. ముశ్రీఫా గ్రామానికి చెందిన వెంకటాపురం వాసుదేవ్‌కు బలుబద్రాయపల్లికి చెందిన నీలమ్మకు నాలుగేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి మూడేళ్ల వయస్సు ఉన్న ఓకొడుకు ఉన్నాడు. బుధవారం ఉదయం కుటుంబంలో గొడవలు జరగడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో నీలమ్మ పురుగుమందు తాగింది. గమనించిన కుటుంబసభ్యులు ప్రైవేటు వాహనంలో కోస్గి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈసంఘటనపై పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ బాల్‌రాజ్ తెలిపారు.

ప్రేమికులకు సహకరించాడని దాడి..

- మనస్తాపంతో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య


సాయి (ఫైల్)

తాడూరు: ప్రేమ జంటకు సహకరించాడని కొందరు దాడిచేయగా మనస్తాపం చెంది ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని చర్లయిటిక్యాలలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల తెలిపిన వివరాలు.. చర్లయిటిక్యాలకు చెందిన వంకేశ్వరం సాయి(22) తండ్రి అంజనేయులుకు తోడుగా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇటీవలే అదే గ్రామానికి చెందిన ఓ ప్రేమజంట ఊర్లో నుంచి వెళ్లిపోయి కులాంతర వివాహం చేసుకుంది. ఈ జంటకు సహకరించాడన్న నెపంతో అమ్మాయి బంధువులైన చంబయ్య, శివ, బాలరాజు, కాశీం, నరేందర్‌రెడ్డి మంగళవారం రాత్రి సాయి ఇంటికెళ్లి అతడిపై, తల్లిదండ్రులపై దాడిచేసి భయభ్రాంతులకు గురిచేశారు. దీంతో అవమానం భరించలేక సాయి బుధవారం తన వ్యవసాయ పొలంలో మామిడి చెట్టుకు ఉరేసుకున్నాడు. స్థానికులు గమనించి జిల్లా ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడిపై దాడిచేసి మృతికి కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మృతుడి తండ్రి ఆంజనేయులు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ స్వామి తెలిపారు.





లక్ష్యం నెరవేరిందో.. నిర్లక్ష్యం ఆవహించిందో..

మీరు ఇక్కడ చూస్తున్న రెండు ఫొటోలు ఒక్కటే (పెద్ద పులుల బొమ్మలు).. కాకపోతే మొదటిది రెండేళ్ల క్రితం తీసినది కాగా.. రెండోది తాజా ఫొటో. పర్యాటకులు, వన్యప్రాణి ప్రియులను ఆకట్టుకునేందుకు శ్రీశైలం- హైదరాబాద్ ప్రధాన రహదారి మన్ననూరు ప్రధాన కూడలిలోని ఫారెస్టు డివిజనల్ ఆఫీస్ ఎదుట ఏర్పాటు చేశారు. ఇందుకు తగ్గట్టుగానే అటవీ శాఖ చేపట్టిన నల్లమల జంగిల్ సఫారీ టూర్‌కు విశేష ఆదరణ లభిస్తోంది. ఇంకేం తమ లక్ష్యం నెరవేరింది అనుకున్నారో.. లేక నిర్లక్ష్యం ఆవహించిందో కానీ, ఎంతో ఆకర్షణీయంగా, నిజమైన పెద్ద పులిలా ఠీవిగా కనిపించిన ప్రతిమలు ఇలా కళావిహీనంగా మారాయి. మరి అధికారులు వీటికి పూర్వవైభవం తీసుకువస్తారో.. లేక అలాగే వదిలేస్తారో వేచి చూడాలి.

– మన్ననూర్

ఉమామహేశ్వరంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు
- ఆలయాన్ని సందర్శించిన వేదపాఠశాల విద్యార్థులు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశర క్షేత్రం బ్రహ్మోత్సవాలు బుధవారంతో ముగిశాయి, నల్లమల కొండలపై వెలసిన శ్రీపార్వతీ పరమేశ్వరుల బ్రహ్మోత్సవాల సందర్భంగా జరుగుతున్న వేడుకలను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. షాద్‌నగర్ వేదపాఠశాలకు చెందిన 150 మంది విద్యార్థులు ఆలయాన్ని సందర్శించి మొక్కులు తీర్చుకున్నారు. పాపనాశిని గుండం వద్ద భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు ఉదయం గవ్యంత, వాస్తుపూజలు, వాస్తుహోమంతో పాటు పాపనాశనం నందు ఉత్తరాయణ పుణ్యకాలస్నానములు, ప్రత్యేక పూజలను వేద పండితులు వీరయ్యశాస్త్రి నిర్వహించారు. ఈ వేడుకలను ఆలయ కమిటీ అధ్యక్షుడు భీరం మాధవరెడ్డి, కార్యనిర్వహణధికారి శ్రీనివాస్‌రావుల పర్యవేక్షణలో విజయవంతంగా కొనసాగాయి.


ఉమామహేశ్వర క్షేత్రంలో షాదనగర్ వేదపాఠశాల విద్యార్థులు

కొనసాగుతున్న నిరంజన్‌షావలీ ఉర్సు

రంగాపూర్ నిరంజన్‌షావలీ ఉర్సు ఉత్సవాలు కొనసాగుతున్నాయి. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రత్యేక మొక్కులు ఉన్న భక్తులు పోటేళ్ల సమర్పించి ఫాతేహాలు, కందోరీలు చేసి మొక్కులు చెల్లించుకుంటున్నారు. కోర్కెలు తీరాలని దర్గాకు వచ్చిన భక్తులు చెట్టుకు ముడుపులు కడుతున్నారు.

దర్గా హుండీ ఆదాయం రూ. 3.80లక్షలు..

అచ్చంపేట రూరల్: మండలంలోని రంగాపూర్ నిరంజన్‌షావలీ దర్గా హుండీ ఆదాయం రూ.3.80లక్షలు వచ్చింది. బుధవారం దర్గా వద్ద హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ఈ కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న దర్గా కమిటీ సభ్యులు

పెరిగిన ఉల్లి ధర

- గరిష్టంగా రూ.4020
- కనిష్టంగా రూ. 3510

దేవరకద్ర: స్థానిక మార్కెట్ యార్డులో బుధవారం ఉల్లి లావాదేవీలు జోరుగా సాగాయి. దాదాపు వేయి బస్తాల ఉల్లి అమ్మకానికి రావడంతో వ్యాపారులు పోటీపడి వేలంలో కొనుగోలు చేశారు. ఉల్లి దిగుబడులు పెరిగినప్పటికీ ధరలు మరికొంత పెరిగాయి. గత వారం కన్నా ఉల్లి ధరలు మరింత పెరిగినా వ్యాపారం జోరుగా సాగింది. స్థానిక వ్యాపారులతో పాటు చిరు వ్యాపారులు, బయట నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొన్నారు.

గత వారం కన్నా..

దేవరకద్ర మార్కెట్‌లో గత వారం నమోదు అయిన ధరల కన్నా ఈ వారం ఉల్లి ధర పెరిగింది. వేలంలో నాణ్యంగా ఉన్న ఉల్లి క్వింటాల్‌కు గరిష్టంగా రూ. 4020, కనిష్టంగా రూ.3510గా ధరలు నమోదయ్యాయి. చిన్నసైజు ఉల్లికి రూ.3వేల వరకు ధర లభించింది. మార్కెట్ నిబంధనల ప్రకారం 45కేజీల ఉల్లి బస్తా గరిష్టంగా రూ.2050, కనిష్టంగా రూ.1800 వరకు ధరలు నిర్ణయించి అమ్మకాలు సాగించారు. చిన్నసైజు ఉల్లి బస్తా ధర రూ. 1500 వరకు వచ్చింది.



వ్యక్తి ఆత్మహత్యాయత్నం


జిల్లా కేంద్రంలో చికిత్స పొందుతున్న నరసింహ

నాగర్‌కర్నూల్: ప్లాట్ రిజిస్ట్రేషన్ చేయలేదని పురుగుల మందుతాగి వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేసిన సంఘటన బుధవారం పెద్దకొత్తపల్లిలో చోటుచేసుకుంది. బాధితుల కథనం ప్రకారం.. పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో 2016లో షట్టర్ ప్లాట్ కొనుగోలు చేసిన కుమ్మరి నరసింహ (40) వెంచర్ యజమాని ప్లాటు రిజిస్ట్రేషన్ చేయలేదని బుధవారం యజమాని ఇంటి వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. దీన్ని గమనించిన యజమాని బాధితుడిని తన కారులో నాగర్‌కర్నూల్ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించాడు. ప్రస్తుతం బాధితుడు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. 2016లో మండల కేంద్రంలో నాగర్‌కర్నూల్ వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై వెంచర్ చేశారు. అందులో కోడేరు మండలం రాజాపూర్ గ్రామానికి చెందిన కుమ్మరి నరసింహ షట్టర్ ప్లాట్ కొనుగోలు చేశాడు. ప్రభుత్వం డీటీసీపీ లేఅవుట్లు కాకుండా ఇతర వెంచర్ల రిజిస్ట్రేషన్లు ఆపేయడంతో ఆయనకు రిజిస్ట్రేషన్ చేయలేదు. 8 సంవత్సరాల నుంచి వెంచర్ యజమానులను రిజిస్ట్రేషన్ చేయమని అడిగితే అప్పుడు ఇప్పుడు అంటూ కాలయాపన చేస్తూ వచ్చారు. దీంతో డబ్బులు ఇచ్చినా రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో విసిగిపోయిన నరసింహ పెద్దకొత్తపల్లి మండల కేంద్రంలో ఉన్న వెంచర్ యజమాని దండు నర్సింహ ఇంటి వద్ద పురుగుల మందు తాగాడు. ఈ సంఘటనపై పెద్దకొత్తపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

భార్యతో గొడవపడి..

- భర్త ఆత్మహత్యాయత్నం

కోడేరు: భార్యతో గొడవ పడి భర్త ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఘటన మండలంలోని బావాయిపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. బావాయిపల్లికి చెందిన కురుమమ్మకు పెద్ద కొత్తపల్లి మండలం పెద్దకారుపాములకు చెందిన విష్ణుతో కొన్నేళ్ల క్రితం వివాహమైంది. కాగా భార్యాభర్తలు తరుచూ గొడవపడేవారు. పుట్టింట్లో ఉన్న భార్యతో విష్ణు బుధవారం గొడవపడి బ్లేడుతో రెండు చేతులు కోసుకున్నాడు. కుటుంబసభ్యులు గమనించి 108 వాహనానికి సమాచారం ఇవ్వగా వారు అక్కడికి చేరుకొని ప్రథమ చికిత్స చేశారు.

‘ఇందిరమ్మ భరోసా’ అమలుకు చర్యలు

‘ఉపాధి’ పనుల ఆధారంగా అర్హుల గుర్తింపు

- కూలీల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు
- 20 రోజుల పనిచేసిన కుటుంబాలు 14వేలు
- ఈనెల 26 నుంచి అమలు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): వ్యవసాయ భూమి లేని కూలీలకు ఇందిరమ్మ భరోసా పథకాన్ని అమలుచేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు వేగవంతం చేసింది. కూలీలకు ఈపథకం కింద కుటుంబానికి రూ.12వేలు అందించనుండగా అర్హులను గుర్తించే పనిలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. ‘ఉపాధి’ పనులకు వెళ్లే వారికి ఈ పథకాన్ని వర్తింపజేస్తామని ప్రభుత్వం ప్రకటించిన నేపథ్యంలో అర్హుల గుర్తింపు ప్రక్రియను ఈజీఎస్ సిబ్బందికి అప్పగించారు. ఇలా సేకరించిన వివరాలు ప్రభుత్వం సూచించిన వెబ్‌సైట్‌లో నమోదు చేస్తున్నారు. ఈనెల 26వ తేదీ లోపు అర్హులను గుర్తించడంతో పాటు గ్రామసభల్లో లబ్ధిదారుల జాబితా ప్రకటించి ఆమోదం పొందాల్సి ఉంటుంది. దీంతో క్షేత్రస్థాయిలో అర్హుల వివరాల సేకరణను వేగవంతం చేశారు.

జాబ్‌కార్డు ఆధారంగా..

ఉపాధి హామీ జాబ్‌కార్డు కలిగి ఉన్న కుటుంబాల వివరాలు ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ నుంచి అధికారులు సేకరించారు. దీన్ని జిల్లాలవారీగా విభజించి ఆయా జిల్లాల అధికారులకు అందజేశారు. వీటి ఆధారంగా జిల్లాలో ఉపాధి పనులకు వెళ్తున్న కూలీల వివరాలను అధికారులు పరిశీలిస్తున్నారు. 20రోజుల పనిదినాలు పూర్తిచేసిన కుటుంబాల్లో భూమిలేని వారి వివరాలను సేకరిస్తున్నారు.


ఉపాధి పనిలో నిమగ్నమైన కూలీలు (ఫైల్)

2.22 లక్షల కూలీలు...

జిల్లాలో 441గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 1.35 జాబ్‌కార్డులు ఉండగా 85 వేల జాబ్ కార్డులు యాక్టివ్‌గా ఉన్నాయి. మొత్తం 2.22 లక్షల కూలీలు ఉంటే 1.28లక్షల కూలీలు యాక్టివ్‌గా ఉన్నారు. వ్యవసాయ భూమిలేని కూలీల కుటుంబాలను సిబ్బంది గుర్తించిన తర్వాత వారి వివరాలతో కూడిన జాబితాను గ్రామసభల్లో వెల్లడించనున్నారు. ఆ తరువాత అర్హులను ఎంపిక చేస్తామని అధికారులు చెబుతున్నారు. అర్హుల జాబితా పూర్తయ్యాక ప్రభుత్వానికి నివేదిక అంజేస్తారు. గ్రామసభల్లో అర్హులుగా గుర్తింపు పొందిన వారికి ఇందిరమ్మ భరోసా కింద ఆర్థికసాయం అందనుంది.

ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లకు బాధ్యత

జిల్లాలో ఉపాధి కూలీల ఇళ్లకు వెళ్తున్న అధికారులు వారి వివరాలను సేకరిస్తూ ఆధార్, బ్యాంక్ ఖాతా నంబర్లు నమోదు చేసుకుంటున్నారు. గ్రామాల్లో ఈవివరాలు సేకరించే బాధ్యత ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. వీరు సేకరించిన సమాచారాన్ని పీఓలు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తుండగా మండల స్థాయిలో ఏపీఓలు పర్యవేక్షిస్తారు. జిల్లా స్థాయిలో ఏపీడీలు, పీడీ పర్యవేక్షిస్తున్నారు. జిల్లాలో 14వేల కుటుంబాలు 20రోజుల పనిదినాలు పూర్తి చేసినట్లు గుర్తించారు.

అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలి

- అర్చకులకు రూ.25వేలు, నైవేద్యానికి రూ.10వేలు ఇవ్వాలి
- అన్ని జిల్లాలో అర్చక భవనం ఏర్పాటుచేయాలి
- ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్రఅధ్యక్షుడు వాసుదేవశర్మ


మాట్లాడుతున్న ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవశర్మ

స్టేషన్ మహబూబ్‌నగర్: అరకొర వేతనాలతో జీవనం గడుపుతున్న ధూప, దీప నైవేద్య అర్చకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని ధూప, దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వాసుదేవ శర్మ అన్నారు. స్థానిక జెడ్పీ సమీపంలోని ద్వారకామాయి బాబా మందిరంలోగల లయన్స్ హాల్‌లో బుధవారం ఆ సంఘం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముందుగా జ్యోతిప్రజ్వలన చేసి వాసుదేవశర్మ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 16 ఏళ్ల క్రితం ధూప, దీప నైవేద్య పథకం వచ్చిందన్నారు. అప్పుడు దేవాలయ నైవేద్యాల కోసం రూ.వెయ్యి, అర్చకులకు రూ.1500 నిర్ణయించారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రంలో 2015 జూలై నుంచి రూ.6వేలు ఉండేదని, దానిని రూ.10వేలకు పెంచినట్లు తెలిపారు. దీంట్లో అర్చకుడికి రూ.6వేలు, దేవాలయ నైవేద్యం కోసం రూ.4వేలు అందించే వారన్నారు. కానీ ప్రస్తుతం నిత్యావసరాలు, జీవన ప్రమాణాలు పెరగడంతో అర్చకులు దిగువస్థాయిలో జీవిస్తున్నట్లు తెలిపారు. మూడు నెలల పెండింగ్ వేతనాలు చెల్లించాలన్నారు. అర్చకులకు రూ.25వేలు వేతనం, నైవేద్యానికి రూ.10వేలు ఇవ్వాలని కోరారు. అర్చక వెల్ఫేర్ ఫండ్ సదుపాయాలను వారికి వర్తింపజేయాలన్నారు. హెల్త్‌కార్డులు, ఇళ్లు లేని వారికి గృహ సౌకర్యం, ఉచిత బీమా సదుపాయం ఇవ్వాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్చకులకు రాజకీయ వేధింపుల నుంచి రక్షణ కల్పించాలని కోరారు. అన్నిజిల్లాల్లో అర్చకులకు అర్చక భవనం ఏర్పాటుచేయాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్(ఏసీ)కి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి అన్నవద్దుల ప్రసాద్‌శర్మ, డీడీఎన్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు గాండ్ల రవి, జిల్లా అధ్యక్షులు జంగం మహేష్, సహాయ కార్యదర్శి వాసుదేవశర్మ, కోశాధికారి పవన్‌కుమార్, నర్సింహారావు, జయతీర్థచారి, లక్ష్మీకాంతాచారి, రామలింగం, చక్రవర్తిచారి, చంద్రశేఖర్, రామశర్మ పాల్గొన్నారు.

వ్యవసాయ సహకార సంఘాల పనితీరు భేష్


విజ్ఞాన యాత్రలో భాగంగా కేరళ రాష్ట్రంలో పాలమూరు డీసీసీబీ పాలకవర్గ సభ్యులు

- డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య
- కేరళ రాష్ట్రంలో డీసీసీబీ పాలకవర్గం పర్యటన

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): కేరళలో వ్యవసాయ సహకార సంఘాల పనితీరు భేష్‌గా ఉందని డీసీసీబీ వైస్ చైర్మన్ కోరమోని వెంకటయ్య అన్నారు. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ఏర్పాటుచేసిన విజ్ఞాన యాత్రలో భాగంగా డీసీసీబీ పాలకవర్గం, ఉమ్మడి జిల్లాలోని సింగిల్‌విండో చైర్మన్లు కేరళ రాష్ట్రంలోని పలు సహకార సంఘాల పనితీరును పరిశీలించారు. బుధవారం నడుంకందం సహకార సంఘం చైర్మన్ సింధు ప్రకాష్, డైరెక్టర్ నర్సన్, విద్దు బ్యాంక్ సిబ్బంది తమ బ్యాంక్ పురోగతిని బృందానికి వివరించారు. తమ సొసైటీకి 30వేల మంది సభ్యులు ఉన్నారని, 11 బ్రాంచ్‌లతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయని వివరించారు. ఇక్కడ ప్రధానంగా అల్లం, మిరియాలు, కొబ్బరి, రబ్బరు తదితర ఉపాధి అవకాశాలకు రైతుల పొలాన్ని మార్ట్‌గేజ్ చేసుకుని మార్కెట్ విలువలో 40శాతాన్ని రైతులకు ఓవర్ డ్రాఫ్ట్ ద్వారా లేదా, క్యాష్ క్రెడిట్ ద్వారా రైతులకు రుణాలు అందజేస్తున్నట్లు వారు తెలిపారు. రూ.50 వేల వరకు పంట రుణాలను రైతులకు సొంత పూచీకత్తుపై అందిస్తామని, ఆపైన అవసరమైతే మార్టిగేజ్ చేస్తూ రుణం పొందవచ్చని వారు బృందానికి వివరించారు. తెలంగాణలో మాదిరి మూడంచల సహకార వ్యవస్థ కాకుండా కేరళ రాష్ట్రంలో టూ టైర్ సిస్టం అమలులో ఉందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు రంగారెడ్డి, భూపాల్‌రావు, వెంకటేష్ గుప్తా, వంశీచంద్‌రెడ్డి, లక్ష్మీనారాయణ, నాయక్, నర్సింహులు, బ్యాంకు అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దయాకర్‌రెడ్డి, మేనేజర్ సత్యప్రకాష్‌రెడ్డి, ఉమ్మడి పాలమూరు జిల్లా పీఏసీఎస్‌ల చైర్మన్ల ఫోరం అధ్యక్షుడు పోతుల మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పాలెం సుదర్శన్‌గౌడ్‌తో పాటు ఉమ్మడి జిల్లా పరిధిలోని 60 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల చైర్మన్లు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడులు


మాట్లాడుతున్న డా. ప్రభాకర్‌రెడ్డి

- పాలెం కేవీకే కో–ఆర్డినేటర్ డా.ప్రభాకర్‌రెడ్డి

బిజినేపల్లి : రైతులు ఆహార పంట కాలంలో సరైన సమయంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించొచ్చని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సమన్వయకర్త డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఖానాపూర్‌లో కందిలో సామూహిక ప్రదర్శన క్షేత్రాల్లో భాగంగా క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డా.ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ జాతీయ ఆహారభద్రత పథకం వారి ఆర్థిక సహకారంతో రైతులకు నాణ్యమైన కంది విత్తనం ఉచితంగా పంపిణీ చేశామన్నారు. పంట ఉత్పాదకతపై సరైన యాజమాన్య శిక్షణ ఇస్తూ అధిక దిగుబడుల కోసం రైతుల్ని ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. రైతులు వాణిజ్య పంటలనే కాక ఆహార, ధాన్యపు పంటల్లో పప్పు దినసులపై దృష్టిపెట్టాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు డా.శైలా, ఆదిశంకర్, డా.రాజశేఖర్, రామకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

పశుగ్రాసం దగ్ధం

- రూ.8లక్షలు నష్టం


దగ్ధమైన పశుగ్రాసాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రాంలాల్

కొత్తపల్లి: మండలంలోని భోజ్యానాయక్‌తండా వింజమూర్ భూనీడు ప్రధాన రోడ్డుకు సమీపంలో పశుగ్రాసం దగ్ధమైన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. భోజ్యానాయక్‌తండాకు చెందిన రవినాయక్, లాలప్ప వివిధ గ్రామాల రైతుల వద్ద పశుగ్రాసం(జొన్నసొప్ప)ను కొనుగోలుచేస్తారు. వాటిని హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో ఉండే పశువులకు దానాగా మార్చి తరలించేందుకు నిల్వఉంచారు. కాగా మంగళవారం 120 ట్రాక్టర్ల సొప్పతో పాటు దానాగా మార్చే రెండు మిషన్లు, టార్పాలిన్లు అగ్నికి ఆహుతయ్యాయి. రూ.8లక్షల నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. మద్దూరు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేయగా ఘటనాస్థలికి చేరుకొని పంచనామా నిర్వహించారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు మద్దూరు ఎస్ఐ రాంలాల్ తెలిపారు.

డ్రిప్ పైపులు..


కాలిపోయిన డ్రిప్ పైపులు

ఊట్కూరు: స్థానిక శివారు ప్రాంతంలో డ్రిప్ పైపులు దగ్ధమైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. ముంబాయి లక్ష్మణ్ అనే రైతు తన పొలంలో నాలుగెకరాల్లో ఫామ్ ఆయిల్ సాగుచేశాడు. తోటు సాగుకోసం డ్రిప్ పైపులు అమర్చినాడు. కాగా రాత్రివేళ ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు డ్రిప్ పైపులకు నిప్పు పెట్టడంతో అవి పూర్తిగా కాలి బూడిదయ్యాయి. సుమారు రూ.70వేల నష్టం వాటిల్లినట్లు బాధిత రైతులు తెలిపాడు.